క్లుప్తంగా

హైటెన్షన్ అలైన్‌మెంట్ మార్చండి

కడ్తాల్: వ్యవసాయ పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ బీదర్– మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో నష్టపోతామని, వెంటనే దానిని మార్చాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ రైతులు చేపట్టిన దీక్ష శుక్రవారానికి పన్నెండవ రోజుకు చేరుకుంది. దీక్షకు రైతు సంఘం నాయకులు రామకృష్ణ, పెంటారెడ్డి, అభిషేక్ రెడ్డి, కృష్ణయాదవ్, రాజేందర్‌యాదవ్, లాయక్‌అలీ, మహేశ్, కృష్ణ, నర్సింహ, కాలే వెంకటేశ్, రాములుయాదవ్ తదితరులు సంఘీభావం తెలిపారు. రైతులకు అండగా ఉంటామని చెప్పారు.

కేజీబీవీలో స్వచ్ఛతాహీ సేవ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, అధికారులు

కందుకూరు: కొత్తగూడ పరిధి కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భార్గవి, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగవు



జామై మసీదు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో మహ్మద్ ప్రవక్త పేరుతో బోర్డు పెట్టిన ముస్లిం యువకులపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని మైనార్టీ నాయకులు ఖండించారు. శుక్రవారం పట్టణంలోని జామై మసీదు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అక్రమ అరెస్టులు సరికాదన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మాసూం, ఖలీల్, పాషా, జబ్బార్, నవజవాన్ కమిటీ ఇన్‌చార్జి హైమద్, సభ్యులు అబ్దుల్ హఫీజ్, అజీం, షోయబ్, అసద్, షబ్బీర్, జహీర్, అఫ్రోజ్, బాబా, అంజు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ మేనేజర్‌గా శ్రీధర్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: మున్సిపాలిటీ కార్పొరేషన్ మేనేజర్‌గా శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో మూడు నెలలుగా ఉన్న ఖాళీగా పోస్టు భర్తీ అయింది. బడంగ్‌పేట నగర పంచాయతీగా కొనసాగుతున్న సమయంలో ఆయన ఇక్కడ మేనేజర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వరుణ్‌రెడ్డి, విజయ్‌కుమార్, కుమార్, ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ భాస్కర్ తదితరులు మేనేజర్‌ను సన్మానించారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నూతన కార్యవర్గాలను పట్టణంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా కసిరెడ్డి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా సత్యవాణి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, సహాయ కార్యదర్శిగా వనిత, ఆర్థిక కార్యదర్శిగా సుజాత, క్రీడా కార్యదర్శిగా అపరంజిత, సభ్యులుగా మాధవి, కవిత, జిల్లా కౌన్సిలర్‌లుగా బార్గవిని నియమించారు. మాడ్గుల మండల శాఖ అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా విఘ్నేశ్వర్, ఆర్థిక కార్యదర్శిగా కృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా శ్రీను, లక్ష్మణ్, నందన, పాండులను ఎన్నుకున్నారు. తలకొండపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా హతేరాం, ఆర్థిక కార్యదర్శిగా శోబారాణి, జిల్లా కౌన్సిలర్‌గా బాల నర్సింహులు, కడ్తాల్ మండల అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శిగా గోవర్దన్‌లను నియమించారు.

ఆదినుంచీ ఆటంకమే..



నిధులున్నా.. వీడని గ్రహణం

- ప్రశ్నార్థకంగా పుర భవన నిర్మాణం
- అధికారుల బదిలీ.. మారిన ప్రభుత్వం
- ముగిసిన పాలకవర్గం, ఆపై కోర్టు వివాదం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పాలిటీ 4వ వార్డు సర్వే నంబర్ 123/1,2లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో రూ.7 కోట్లతో నూతనంగా నిర్మించ తలపెట్టిన మున్సిపాలిటీ భవన నిర్మాణానికి ఆది నుంచి ఆటంకమే కలుగుతోంది. తొలుత అనుకున్నట్లుగా ముందుకు సాగితే.. 2022 డిసెంబర్ రెండో వారంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ పనిచేసిన ఇద్దరు కమిషనర్లు వరుసగా బదిలీ అయ్యారు. 2023 ఆగస్టులో రవీందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగా.. తాత్కాలికంగా శంకస్థాపన పనులు వాయిదా పడ్డాయి. దీనికి తోడు భవనానికి కేటాయించిన స్థలంపై కోర్టు వివాదం తెరపైకి వచ్చింది. ఆ తరువాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఇరుకు గదుల్లో..

మున్సిపాలిటీకి అన్ని వసతులతో కూడిన విశాలమైన గదులతో కార్యాలయ భవనం కావాల్సి ఉంది. కానీ.. పాత పంచాయతీ భవనంలోని మూడు గదులకు సిల్వర్ ఫ్రేమ్‌లతో అడ్డుగోడలు పెట్టి, కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కమిషనర్, చైర్‌పర్సన్ చాంబర్లతో పాటు కౌన్సిల్ హాల్, టౌన్ ప్లానింగ్ విభాగం, మేనేజర్(అడ్మినిస్ట్రేషన్), ఇంజనీరింగ్ విభాగం, శానిటరీ విభాగం, రెవెన్యూ సెక్షన్, అకౌంట్స్, సిటిజన్ కౌంటర్, ఇన్‌వార్డు, బీడీఎస్‌ఆర్ సెక్షన్, కంప్యూటర్ సెక్షన్, మెప్మా తదితర అధికారులు, సిబ్బందికి విభాగాల వారీగా గదుల ఆవశ్యకత ఉంది.

నిర్ణయం తీసుకోలేదు



కోర్టు వివాదం తదితర కారణాలతో మున్సిపల్ భవన నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం మారింది. ఆ తరువాత పాలకవర్గాల గడువు ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. సమస్యను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట

పంచాయతీగా..

పెద్దఅంబర్‌పేట పంచాయతీ నిర్మాణం నుంచి పురపాలక సంఘంగా మారినా.. సమస్యలు తీరడం లేదు. నగర పంచాయతీ ఏర్పాటు కాక ముందు పంచాయతీగా కొనసాగుతున్న సమయంలో.. నూతన జీపీ భవన నిర్మాణానికి నాటి హుడా చైర్మన్, ప్రస్తుత ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హుడా నుంచి రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత స్థానికంగా అప్పటి పాలకవర్గం గడువు ముగింపుతో పాటు ఆ తర్వాత ప్రత్యేకాధికారుల పాలన, నగర పంచాయతీ, పురపాలక సంఘంగా రూపుదిద్దుకొంది. దీంతో నాటి జీపీ భవనం, నగర పంచాయతీ భవనం, ప్రస్తుత మున్సిపల్ భవనం నిర్మించాలన్న ప్రతిపాదనలు ఉన్నా.. అది నెరవేరడం లేదు. దీనికి తోడు భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంపై కోర్టు వివాదం ఉండటంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.

డైలీవేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష శుక్రవారానికి 8వ రోజుకు చేరుకుంది. దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. వర్కర్స్‌ను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. వర్కర్లకు గతంలో నెలకు రూ.13,800 వేతనం అందేదని, ప్రస్తుతం రూ.11,700కు తగ్గించడం ఎంత వరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఓ నంబర్ 64ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించేలా ట్రెజరీలకు మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వారంతపు సెలవులు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు దాసు, మహేశ్, శేఖర్, సురేశ్, డైలీవేజ్ సిబ్బంది సైదమ్మ, సుమలత, శోభ, వాసు, మస్రు, లక్ష్మి, చంద్రకళ, శ్రీశైలం ఉన్నారు.

అతివల ఆరోగ్యం.. కుటుంబానికి బలం



యాచారం: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక

యాచారం: మహిళల ఆరోగ్యమే ఆ కుటుంబానికి బలమని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో స్త్రీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులకు అక్టోబర్– 2 వరకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుదమాధవి తనిఖీ చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



ఆమనగల్లులో.. డాక్టర్ మంజులాదేవి

ఆమనగల్లు: మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యులు మైమునాబేగం, మంజులాదేవిలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం స్వస్థ్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 241 మందికి.. డాక్టర్లు ఆమని, శ్రీజ, ఆదిత్య, గాయత్రీ, ప్రతీష్, అతుల్‌దాస్, ఖురేశి, జయశ్రీలు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. శిబిరంలో సిబ్బంది తిరుపతిరెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరీ, ఏసుమణి, సునీత, అలివేలు, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

శాస్త్రవేత్త డాక్టర్ వాణిశ్రీ

యాచారం: నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ వాణిశ్రీ అన్నారు. 'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా.. కేఎన్‌ఎం 1638 ఫౌండేషన్ కొత్తరకం వరి విత్తనాలు తీసుకొని, గునుగల్‌లోని దుర్గయ్య, మొగుళ్లవంపులో రాఘవరెడ్డి, నానక్‌నగర్‌లో ముత్యాల సాయి, యాచారంలో వెంకట్‌రెడ్డి సాగు చేసిన పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. వరి సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు ముందుకెళ్లాలని సూచించారు. వరి పొట్టదశలో ఉన్నప్పుడు యూరియాను వాడరాదన్నారు. అధిక మోతాదులో వాడితే.. తాలు గింజలు అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు విత్తడం, సరైన విధానంలో ఎరువులు వాడటం వలన.. పది నుంచి 15 శాతం దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, వివిధ గ్రామాల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, నాయకులు నర్సింహ, వెంకటయ్య, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రోబోటిక్ రివల్యూషన్

ఆకట్టుకున్న విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు



గణితం ఉపయోగంపై విద్యార్థుల ప్రదర్శన

కడ్తాల్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛలిత్ ప్రజ్ఞకల్ప(రోబోటిక్ రివల్యూషన్) కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా 500 మందికి పైగా విద్యార్థులు.. గణితం ఉపయోగం, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, రోబోటిక్ ఉపయోగం, కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఎలా అభివృద్ధి సాధించాలి, ఇస్రోలో దేశ రక్షణకు ఉపయోగ పడే రాకెట్స్ తయారీ, బ్రహ్మోస్ క్షిపణుల తయారీ ఏ విధంగా దేశ రక్షణకు ఉపయోగపడుతున్నాయోనని 100కు పైగా వివిధ రకాల శాస్త్ర ప్రదర్శనలు రూపొందించి, ప్రదర్శించారు. పహల్గాం దాడి సంఘటన, ఆపరేషన్ సింధూర్, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడులు ఎలా సాధించాలో ప్రదర్శనల ద్వారా వివరించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు రూపొందించిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసి సన్మానించింది.

నేటి నుంచి భగీరథ నీటి సరఫరా

ఇబ్రహీంపట్నం: తొమ్మిది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, శనివారం నుంచి యాథావిధిగా పంపిణీ కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. గౌరిదేవిపల్లి సబ్‌స్టేషన్, 2500 కేడబ్ల్యూ పంపుల రెగ్యులర్ మరమ్మతుల కారణంగా తొలుత 11వ తేది నుంచి 14 వరకు అంతరాయం కలుగుతుందని తెలిసినప్పటికీ.. మంగళవారం బేగంపేట వద్ద పైపులైన్లు పగిలిపోవడంతో మరోసారి ఆటంకం కలిగిందని వివరించారు. దీంతో సుమారు 9 రోజుల పాటు సరఫరా నిలిచిందని పేర్కొన్నారు.

పాత బస్టాండ్‌కు బస్సులు నడపాలి

బీజేపీ నాయకుల డిమాండ్



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: పట్నం పాత బస్టాండ్ వరకు ఆర్టీసీ బస్సులు(సిటీ బస్సులు) నడిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హైదరాబాద్, ఇబ్రహీంపట్నం నడిచే సబర్బన్ సిటీ సర్వీసులు పాత బస్టాండ్ వద్దకు రాకుండా, ఓం చౌరస్తా వద్దనే ప్రయాణికులను దించి వేస్తున్నారని పేర్కొన్నారు. దీని వలన సుమారు రెండు కిలో మీటర్ల దూరం వారు నడిచి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. పాత బస్తీలోకి వెళ్లేందుకు ఆటోల సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాత బస్టాండ్ వరకు బస్సులను తిప్పాలని, లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా.. ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేసి, వదిలిపెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాయిని సత్యనారాయణ, జక్క రవీందర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రాఘవేంద్రస్వామి, శ్రీనివాస్‌యాదవ్, సంతోష్, శివ, నరేష్, అజయ్, శశిధర్ రెడ్డి, సాయిరాం రాంబాబులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఇబ్రహీంపట్నం: మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సూచించారు. వినోబానగర్‌లోని ప్రభుత్వ నూతన డిగ్రీ కళాశాల(ప్రారంభం కాలేదు) భవన ఆవరణలో జాతీయ సేవ పథక, సోలీనిస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విద్యాసాగర్, సోలేనిస్ ప్రతినిధి రఘు, దాసు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ భానునాయక్

కడ్తాల్: పశుపోషణలో పాడి రైతులు తగిన జాగ్రత్తలు, మెలుకువలు పాటించాలని మండల పశు వైద్యాధికారి భానునాయక్ సూచించారు. మండల పరిధి గడ్డమీదితండా గ్రామ పంచాయతీ పరిధి వెలుగురాళ్లతండాలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 ఆవులకు గర్భాధారణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో మాజీ సర్పంచ్ పాండునాయక్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆమనగల్లు: పర్యావరణం, పచ్చదనం, స్వచ్ఛదనం అంశాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం విద్యార్థులతో కలిసి వివిధ శాఖల అధికారులు స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమమాధురి, తహసీల్దార్ ఫయాం ఖాద్రి, కమిషనర్ శంకర్, ఎంఈఓ పాండు, ప్రిన్సిపాల్ మాధవరావ్, ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలతో ఉపాధ్యాయులు, నాయకులు

ఉపాధ్యాయులకు సన్మానం

ఆమనగల్లు: ప్రభుత్వ ఉపాధ్యాయులను శుక్రవారం సాయిరాం మెడికల్స్, ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా టీచర్లను లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కమిషనర్ శంకర్, ఎంఈఓ పాండు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, పద్మ, చందులాల్, కృష్ణయ్య, పద్మజ్యోతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లేశ్, సరస్వతి, అశోక్‌రెడ్డి, స్వాతి, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి కంటి ఆస్పత్రిలో శుక్రవారం హైదరాబాద్ పుష్పగిరి కంటి వైద్యశాల సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో కంటి వైద్యులు మల్లేశ్, శ్రావణిలు 110 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. వీరిలో 43 మందిని ఆపరేషన్ల నిమిత్తం పుష్పగిరి వైద్యశాలకు పంపించారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

ఆమనగల్లు: ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి కబడ్డీ వాలీబాల్ పోటీలకు తలకొండపల్లి మండలం వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ పరమేశ్ తెలిపారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పోటీల్లో.. కబడ్డీ అండర్ 14 బాలుర విభాగంలో పవన్, శివశంకర్, మధు, పవన్‌తేజ, 17 విభాగంలో రామకృష్ణ, వాలీబాల్ అండర్ 14 బాలుర విభాగంలో సాత్విక్, మారుతీలు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు నసీమ్ సుల్తానా అభినందించారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పహాడీషరీఫ్: విద్యుత్ అధికారులు బస్తీబాట పట్టారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 7వ వార్డు యాహ్యానగర్‌లో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న తీగలు, వీధి దీపాలు లేక రాత్రి పూట అంధకారం,బుర్హాన్ ఖాన్ చెరువు పరిసరాలలో విద్యుత్ ప్రమాదాలు, లో ఓల్టేజీ సమస్య, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్న స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం వారు పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు చిన్న పిల్లలు అందేంత ఎత్తులో ఉండడం, ఇళ్ల బాల్కానీలను ఆనుకొని ఉన్న వైర్లను మార్చాలని బీఆర్‌ఎస్ నేతలు.. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు

కడ్తాల్: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం దేవర చెరువును ఎంపీడీఓ సుజాత, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజీలు పరిశీలించారు. ఎంగిలిపూలు మొదలు సద్దుల బతుకమ్మ వరకు నిమజ్జనం చేసే ప్రదేశం వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బ్రహ్మాచారి, మహేశ్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: న్యాయవాదులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, వారికి రక్షణ కల్పించడానికి చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ డిమండ్ చేశారు. లాయర్లపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ.. శుక్రవారం విధులను బహిష్కరించి, కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు రామకృష్ణ, విజయ్‌కుమార్‌గౌడ్, కృష్ణ, శేఖర్, మల్లేశ్, లక్ష్మణశర్మ, లింగంగౌడ్, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, జగన్‌గౌడ్, మహేశ్, శ్రీనివాస్, సర్దార్, శ్రీశైలం, మురళీకృష్ణలు పాల్గొన్నారు.